కథా నిలయం
3544
శ్రీకాకుళం

# పాత పగలు - కొత్త వగలు

ఉగాదినాడు జరిగిన సంగతి చెపుతాను. ఈ పండుగ నాడు పాతపగలను మరచిపోయి, కొత్తవగలను చిగుర్చుకోవాలని పెద్దలు చెపుతుంటారు గదూ! ఈ పండుగ ప్రత్యేకత ఇదే నంటారు. అందుకనే, పరమ చేదుగా వేపాకు పువ్వే అనుకోండి, పచ్చడిగా చేసుకు తినటంతో ఈ పండుగ ప్రారంభం అవుతుంది. అంటే జీవితంలోవున్న చేదుతో సఖ్యత పడటంతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్న మాట!

నామట్టుకు నాకు పండుగలంటే వ్యామోహంలేదు. నవీన వాతావరణంలో పెరిగిన వాడినవటమే దీనికి కారణం. మన పూర్వులు రోజూ చిరుతిండి తినేస్వభావం గలవారు కాదు. అందుకని ఏదోఒక నెపంతో పిండివంటలు చేయించుకొని తినటానికి ఈ పండగలనూ, పబ్బాలనూ పెట్టారని నా ఉద్దేశం. ఈ రోజుల్లో ఎక్కడపడితే అక్కడ పిండివంటలు

దొరుకుతాయి; ఎప్పుడు పడితే అప్పుడు తింటున్నాం. ఇక ఈ పండుగ లెందుకు? అవుసరం లేదని నా ఉద్దేశం.

కాని నాకు గారెలంటే వ్యామోహం. అందుకని రేపు పండుగనగా నా భార్యను అడిగాను—"ఏం చేస్తున్నావు?" అని.

ఏ పిండివంట రుచయినా ముందుగా చెపితే పోతుందని నా భార్య విశ్వాసం— "ఏదో చేస్తున్నాను." అన్నది.

"ఏం చేస్తున్నావని?"

"ఏదో చేస్తున్నానుగా!"

"ఈ పిండివంటల విషయంలో నాకూ కొన్ని అభిప్రాయాలు వున్నయి. కాబట్టి ముందుగా చెప్పటం మంచిది." అన్నాను.

ఈ మాటకు నన్ను క్రీగంట చూస్తూ "గారెలు చేస్తున్నాను, సరా?" అన్నది.

గారెలమీద నాకున్న వ్యామోహం నా భార్యకంటే ఇంకా ఎక్కువ ఎవ్వరికి తెలుస్తుంది? కాఫీహోటలకు వెళ్ళినా, ఎవ్వ రేమనుకుంటారో అని, ఏ రెండు మూడు గారెలతోనో సరిపుచ్చుకుంటామాయె! ఈవ్యామోహం తెలిసివున్న మనిషి గనుక 'గారెలు చేస్తున్నా' నని చెప్పి, వెంటనే 'సరా!' అని ఎత్తిపొడిచింది.

సరే! సరికాకపోవటం యేమిటి? కాని గారెలకోసం అడిగానని ఆమె తెలుసుకోగలగడం నాకేమంత యిష్టంగా లేదు.

"నీ యిష్టంవచ్చినట్లే కానివ్వు. నువ్వు యెలాగూ గారెలు వండదలచినప్పుడు, బూరెలు వండమంటే మాత్రం వండుతావా యేమిటి?"

"ఎందుకు వండను?" అన్నది నా భార్య.

నిజంగా వండుతుందేమోనని నాకు భయం వేసింది. "ఆఁ! నవ్వుతూ అంటున్నా? నువ్వేమిటి; బూరెలువండటం యేమిట?" అన్నాను.

"పాత పగలు మరచిపోవలసిన పండుగండీ ఇది! అందు కని ఇవ్వాళ్లో మీరు బూరెలమీద వున్న పగను ఒదులుకో వాలి. ఆ అవకాశం మీకు ఇవ్వటానికి రేపు నిజంగా బూరెలు వండదలచాను." అన్నది నా భార్య.

నా భార్య అన్నంతపని చేసే స్వభావం గలది. రేపే తప్పకుండా బూరెలు వండుతుందని నాకు తెలుసు. పైగా నేను యేమనటానికీ వీల్లేని ఆర్గ్యుమెంట్ ఒకటి పెట్టింది. నాకు కొద్దిగా కోపం వచ్చింది— "ఇంకేం? మీనాన్నని పిలువు!" అన్నాను.

"ఆయనెందుకండీ," అని ఆశ్చర్యంగా అడిగింది నా భార్య – ఈ మధ్య ఆయనకూ నా భార్యకూ కాస్త కలత యేర్పడిఉంది.

"బూరెలు తినటానికి," అన్నాను: "ఈరోజుల్లో మీనాన్న కాకపోతే, ఇంకెవ్వరుతింటారు బూరెలు?"

"మానాన్నకు ఎప్పుడూ బూరెలంటే ఇష్టమే! పండగ నాడు తినవలసిన కర్మ ఆయనకేం, పట్టింది?" అన్నది నా భార్య.

మొత్తానికి రేపు ఏమిపిండివంటలు చెయ్యదలచిందో నా భార్యచే చెప్పించుకోలేకపోయాను. కష్టసుఖాలు తెలిసిన మనిషి, గారెలు వండక పోతుందటలే—అనే ఆశతో ఆఫీసుకు వెళ్ళాను.

♦ ♦ ♦ ♦

మరునాడు తెల్లవారకముందే నా భార్యలేపగా లేచాను. త్వరత్వరగా మొహం కడుక్కొని స్నాన సంధ్యాదులు ముగించుకొని, గదిలోకివెళ్ళి బయటకు వెళ్ళి వద్దామని డ్రెస్ చేసుకుంటున్నాను. ఉగాదిగా, నలుగురు స్నేహితుల్ని పలకరించి వద్దామని కోరిక.

ఇంతలో వాకిట్లో బండి ఆగిన చప్పుడైంది. 'పండుగ నాడు ఎవ్వరు వచ్చారబ్బా' అని ఆలోచిస్తూ వున్నాను.

మాచిన్నమ్మాయి బయటనుంచి "నాన్నా, నాన్నా" అంటూ పరుగెత్తుకొనివచ్చి, "అత్తయ్యొచ్చింది నాన్నా!" అన్నది.

"ఏ అత్తయ్యో?"

"నీ చెల్లెలు."

నా చెల్లెలు ఎందుకు వచ్చిందా—అని ఆశ్చర్యపడ్డాను. ఈమధ్య యేదో చిన్నవిషయంమీద నాతో పోట్లాడి మా ఇంటికి రావటం మానివేసింది నా చెల్లెలు.

నా భార్య ఎదురుగా వెళ్ళి ఆమెను తీసుకొచ్చింది. నా వంక కొంటెగా చూస్తూ, "ఒదినె వచ్చిందండీ!" అన్నది.

"నిన్న ఒదినె మా ఇంటికి వచ్చి, పండుగకు రావా లంటే, రావాలని పట్టుపట్టుకొని కూర్చుంది అన్నయ్యా! పిల్లలతో నాకెక్కడ తీరుతుందంటే వింటేనా? 'ఒక్కసారి అటొచ్చి చూచిపో; లేకపోతే మీ అన్నయ్య మనస్సు కష్ట పెట్టుకుంటాడు' అన్నది. పిల్లల్నికూడా చూచినట్లు అవుతుం దని బయలుదేరి వచ్చాను" అన్నది నా చెల్లెలు.

"మంచిపని చేశావమ్మా," అన్నాను.

"నాలుగురోజులనుంచి మీ అన్నయ్య ఒకటేపోరు ఒదినా, వెళ్ళి అమ్మాయిని తీసుకురా తీసుకురా_అని," అన్నది నా భార్య.

నేను కళ్ళు అప్పగించి నాచెవులను నేనే నమ్మలేకుండా వింటూ నుంచున్నాను.

"ఏకోదరులంగదూ, వుంటుంది మరి!" అన్నది నా చెల్లెలు.

"ఎటు తిరిగీ పరాయివాళ్ళం మేమే," అన్నది నా భార్య.

నా భార్యా, చెల్లెలూ వంటయింట్లోకి వెళ్ళారు. నా భార్య చేసినపని నాకప్పుడు అర్థం అయింది. పాతపగలు మరచిపోవలసినపండుగయిదని ఆవిడ మొదటినుంచీ అంటూనే వుంది. నేనూ నా చెల్లెలూ తగాదా పడటం దానికి యిష్టం లేదు. మా రెండు కుటుంబాలమధ్యా సఖ్యత కలిగించటానికి ఈ పనిచేసింది. బాగుంది అనుకున్నాను.

నేను డ్రెస్ చేసుకోవటం పూర్తి చేసుకొని బయటకు వెళ్ళి వస్తానని చెప్పటానికి లోపలికి వెళ్ళాను. మా చిన్నమ్మాయి ఎదురుగా వచ్చి "నాన్నా, అత్త తెచ్చింది ఈ చొక్కా," అని తాను వేసుకున్న చొక్కా చూపింది

"ఇది కూలా అత్తే తెచ్చింది నాన్నా," అని తాను వేసుకున్న చొక్కా చూపాడు, అందర్లోకి చిన్నవాడు.

"బాగుందయ్యా, బాగుంది" అన్నాను.

వంటఇంట్లోనుంచి నా భార్య "ఇటొకసారి రండి" అని పిలిచింది. "చూలు నాన్నా," అని తాను వేసుకున్న చొక్కాను వర్ణించబోతున్న చిన్న వాణ్ణి ఎత్తుకొని వంట ఇంట్లోకి వెళ్ళాను.

నాభార్య నాచెల్లెలికి బొట్టు పెడుతూవుంది నావైపు తిరిగి, "చూడండి, నిన్న మీరు తెచ్చిన చీర ఒదినెకు ఎంత అందంగా వుందో" అన్నది.

నేను నిర్ఘాంతపోతూ చూశాను. నా చెల్లెలు కొత్త చీర కట్టుకొని వుంది. నిజంగా ఆ చీర అమ్మాయికి బాగా సరిపోయింది! "బాగుందమ్మా" అన్నాను.

"నీకు సరిపోయే చీర తేవాలని, నాలుగు రోజులు కొట్లన్నీ గాలించి ఈ చీర తెచ్చారు వదినా!" అన్నది నా భార్య.

"సరేగాని, అన్నయ్యా, ఇప్పుడెందుకు చెప్పు ఈ చీరెలూ, ఇవన్నీని—నీది చాద స్తం కాకపోతే," అన్నది నా చెల్లెలు.

"పోనీలేఅమ్మాయి, పండగ్గదా. అందులో ఉగాది, -" అని మాటలో మాట కలిపివేశాను.

నాభార్య చేసిన వేపాకుపచ్చడి తిని బయటకు బయలు దేరాను. ఉదయంనుంచీ జరిగిన సంగతులన్నీ జ్ఞాపకం చేసు కుంటూ రిక్షాఎక్కాను. నాభార్య చాలా మంచిపని చేసింది. నా చెల్లెలుతో తగాదాపడ్డా, మనస్సు వేధిస్తూనే వుంది; ఆ వేదన ఇవ్వాళ నాభార్య తీర్చింది. ఈ పండుగపూట నేను కూడా ఏదన్నా మంచిపనిచేస్తే బావుండును — అనిపించింది నాకు.

♦ ♦ ♦

నేను అనుకున్న దానికంటే కొంచెం ఆలస్యంగా ఇంటికి వతిగివచ్చాను. నేను వచ్చేటప్పటికి పిల్లలు వాకిట ముందు ఆడుకుంటున్నారు. వంటింట్లో ఏవో కబుర్లు పెట్టు కొని కూర్చొని వున్నారు నాభార్యా, చెల్లెలు.

"ఇంత ఆలస్యం చేశారేం?" అని అడిగింది నాభార్య

"మరొకపని తగిలింది. ఆపని చూసుకొని వచ్చేటప్ప టికి, ఇంతసేపు పట్టింది" అన్నాను.

"మీకోసం తనుకూడా టిఫిన్ తినకుండా కూర్చుంది మీ చెల్లెలు" అన్నది నా భార్య.

"ఏం చేశావేమిటి?" అని అడిగాను.

"బూరెలు" అన్నది నా భార్య.

"ఆఁ! బూరెలే?" అని నా ఆశ్చర్యాన్నీ, ఆశాభం గాన్నీ వెలిబుచ్చాను.

పాపం నా చెల్లెలికి నన్నుజూస్తే జాలివేసిందో ఏమో, "గారెలుకూడా చేసిందిలే అన్నయ్యా" అన్నది.

"ఊఁ! పరియాచకం ఆడుతున్నా వన్నమాట నాతో" అన్నాను.

"అదొక్కటే తక్కువ" అన్నది నా భార్య ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

"ఒదినె, నీతో పరియాచకం ఆడకపోతే యెవ్వరితో ఆడుతుంది అన్నయ్యా." అని అడిగింది నా చెల్లెలు.

"ఆఁ! ఇంకొకరితో ఆడితే మీ అన్నయ్య వూరుకుంటారు కూడాను!" అన్నది నా భార్య.

♦ ♦ ♦

ఇంటిముందు కారు ఆగిన చప్పుడయింది.

"ఎవ్వరో వచ్చినట్టున్నారు!" అన్నది నా భార్య.

"నీదంతా భ్రమ. పండగపూట ఎవ్వరు వస్తారు?" అన్నాను నేను.

"కారు ఆగితేనే!" అన్నది నా భార్య.

"కారుమీద మనింటికి ఎవ్వరు వస్తారు? పక్కఇంటి వాళ్ళకోసం అయివుంటుంది," అన్నాను నేను.

అంతలోకే మా చిన్నమ్మాయి, "తాత వచ్చాడు నాన్నా, తాత" అంటూ లోపలకు పరుగెత్తుకొని వచ్చింది.

"ఆ! ఎవ్వరు?" అని విస్తుపోయింది నా భార్య.

"తాతే! మీ నాన్న! అన్నది చిన్నమ్మాయి.

"తాత రావటం ఏమిటె!" నా భార్య నమ్మలేదు. ఈ మధ్య కలత ఏర్పడినప్పటినుంచీ ఆయన మా యింటికి

రావటం లేదు. పిలవకుండా ఒకరి యింటికి వచ్చే స్వభావం కలవాడు కాదు ఆయన. అందుకని నా భార్య నమ్మలేదు. అంతలోకి "ఎక్కడున్నావే?" అంటూ వంటింట్లోకి వచ్చాడు మా మామగారు.

"రా నాన్నా" అన్నది నా భార్య.

"బాగున్నావా మామయ్యా?" అని అడిగింది నా చెల్లెలు.

"ఓసి నీ దుంప తెగా? నువ్వటే! నువ్వెప్పుడొచ్చావ్?" అని అడిగాడు మామగారు.

"నేను పొద్దున్నే వచ్చాను మామయ్యా! నిన్న ఒదిన వచ్చి, పండక్కి వస్తేగాని వీల్లేదని కూర్చుంది. ఇక తప్పేదేముంది?"

"తప్పించుకోవటం ఎందుకే? అప్పుడప్పుడూ కలుస్తూ వుంటేనే చుట్టరికం" అని, కూతురుతో "అదిసరేగానమ్మాయి! నా కోసం కారు పంపించావెందుకే? అంతేకీ నేను రావాలంటే నిన్ననే కబురుచేస్తే రాకపోయానా?" అన్నారు.

"నిన్న మిమ్మల్ని పిలవమని నాతో చెప్పిందండీ. నేను పని తొందర్లో వుండి మరచిపోయాను. అందుకని ఇవ్వాళ కారు పంపింది. ఇవ్వాళ ఉగాది అయె! పెద్దవారు మీరు లేకుండా పండుగ చేసుకుంటే ఏం నిండుగా వుంటుంది చెప్పండి" అన్నాను.

ఈ మాటతో తన తండ్రికోసం నేనే కారు పంపించా నని నా భార్య గ్రహించింది. నావంక క్రీగంట చూసింది. 'నేను మాత్రం మంచిపని చెయ్యలేను అనుకున్నావా?' అన్నట్లు నేను కొంటెగా నవ్వి వుంటాను.

"లే నాన్నా, లే ఒదినా, బల్లదగ్గర కూర్చోండి—టిఫిను తిందురుగాని" అన్నది నా భార్య.

మేమంతా కూర్చున్నాం. నా భార్య బూరెలు తెచ్చింది, పళ్ళెంనిండా పెట్టుకొని.

"ముందాయనకు వడ్డించు" అన్నాను.

"ఏమిటమ్మా అవి?" అని అడిగారు మామగారు.

"బూరెలు నాన్నా!"

"ఈ పాతపిండివంటలు యెక్కడ నేర్చుకున్నావే అమ్మా!" అన్నారు మురిపెంగా.

"బూరెలు అంటే వారికిష్టం నాన్నా. అందుకని వండాను."

"మంచిపని చేశావు."

నా భార్య ఎన్ని చెప్పినా వినకుండా బూరెలు ముందు నాకు వడ్డించింది.

"ఇంకా రెండు వడ్డించరాదటే, పాపం, కావాలని చేయించుకొనే" అన్నారు మామగారు.

వద్దు వద్దన్నా వినకుండా ఇంకా రెండు వడ్డించింది. వడ్డిస్తున్నంతసేపూ నా భార్య ముసిముసినవ్వులు నవ్వుతూనే వుంది; వీలు దొరికినప్పుడల్లా నా కళ్ళల్లోకి కొంటెగా చూస్తూనే వుంది. నా చెల్లెలు కనిపెట్టినట్టుంది. ...

'మామయ్యకు నేను వడ్డిస్తాను—ఇవ్వు వదినా" అని నా భార్య చేతుల్లోని పళ్ళెం తీసుకొని దానినిండా గారెలు పెట్టుకొని వచ్చింది.

"నీకు గారెలంటే ఇష్టంగా మామయ్యా?"

"నాకా?" అని ఆశ్చర్యపోయారు, మామగారు.

"మొహమాట పడతావెందుకు మామయ్యా? నాకు ఒదినె చెప్పలేదనుకున్నావా ఏమిటి? ఎవ్వరికి ఇష్టం వచ్చింది వారు తినటం మంచిది" అని మామగారి పళ్ళెంలో యిన్ని గారెలు వడ్డించింది.

"నాకెందుకే యిన్ని!" అన్నారు మామగారు. పాపం ఆయన మనస్సు బూరెలమీదే వుంది.

"మా ముందు మొహమాట పడతావెందుకు మామయ్యా? పెట్టినవన్నీ తినవలసిందే!" అన్నది నా చెల్లెలు.

నేను బూరెలూ, మా మామగారు గారెలూ తినటం మొదలు పెట్టాము, తమ పళ్ళాల్లో అదొకటీ ఇదొకటీవడ్డించు కొని నా భార్యా చెల్లెలూ కూర్చున్నారు. ఏమో, అను కున్నా బూరెలు బాగానే వున్నయ్. నవ్వుతూ నా భార్య వంకకు చూశాను. ఆమె నవ్వింది.

"ఎట్లా వున్నయ్ మామయ్యా గారెలు?" అని అడి గింది నా చెల్లెలు.

"ఎట్లా వుంటం ఏమిటి?" అని కూతురు కేసి చూచి "ఎక్కడ నేర్చుకున్నావమ్మా ఈ వంట. మీ అమ్మ వండితే గారెముక్క-కూడా తినబుద్ధయ్యేది కాదు. అప్పటినుంచి గారెలు తినటమే మానుకున్నా. ఇట్లావుంటే తినటానికేం—

బంగారంలా గున్నాయి." అని గారెముక్క నోట్లో పెట్టుకున్నాడు.

"జాగ్రత్త మామయ్యా, బాగున్నాయని అన్నీ ఒక్కసారే నోట్లో కుక్కుకునేవు. ఎక్కిళ్ళు వస్తాయి" అన్నది నా చెల్లెలు.

"ఆయన ధైర్యముందిగాని, ఒకసారి మీ అన్నయ్యేవం చూడు!" అన్నది నా భార్య.

అప్పుడు తెలిసింది నాకు బూరెలు మెక్కుతున్నానని. నా భార్య విరగబడి నవ్వింది; నా చెల్లెలూ నవ్వకుండా వుండలేక పోయింది.

♦ ♦ ♦

మొత్తానికి అందరం సంతోషంగా టిఫిన్లు పూర్తిచేసి లేచాం. "నేను వెళ్ళొస్తా అన్నయ్యా." అన్నది నా చెల్లెలు. "ఒదినా, మీరంతా మధ్యాహ్నం మీభోజనానికి .యింటికి రావాలి" అన్నది.

నా భార్య తప్పించుకోటానికి ప్రయత్నించింది గాని పడలేదు. మాకు ఒప్పుకోక తప్పలేదు.

"చూడమ్మా," అని మామగారు వెళ్ళబోతున్న నా చెల్లెల్ని ఆపారు. "మధ్యాహ్నం భోజనం చేసుకొని, విశ్రాంతి తీసుకొని సాయంకాలం మా యింటికి రండి" అన్నారు.

'ఏమంది మామయ్యా. నాకు తీరదు" అన్నది నా చెల్లెలు.

"అదేం లాభంలేదమ్మా. మీరంతా వచ్చి తీరాలి. వస్తారని వంటవాడితో చెప్పి వచ్చానుకూడా. వచ్చేటప్పుడు అబ్బాయిని కూడా తీసుకురా అమ్మా!" అన్నారు మామగారు.

ఇంకా నా చెల్లెలు యేదో సణుగుతుంటే, "పండగపూట పెద్దవాళ్ళమాట తోసివెయ్యగూడదమ్మా." అని "మీ అందరితోనూ కాస్త పనికూడా వుంది." అన్నారు,

♦ ♦ ♦

నేనూ నా భార్యా మధ్యాహ్నం పిల్లలను తీసుకొని మా చెల్లెలు యింటికి వెళ్ళాం. ఆయన రచయిత. మంచి పేరులో వున్న రచయితే! మేము వెళ్ళేటప్పటికి యేదో వ్రాసుకుంటున్నాడు.

"ఏమిటి బావా వ్రాస్తున్నావు?" అని అడిగాను.

"ప్రొద్దుట్నించీ ఉగాదిపండుగ ప్రాశస్త్యాన్ని గురించి ఒక కథ వ్రాద్దామని ప్రయత్నిస్తున్నాను" అన్నాడు బావ.

"ఒక్కొక్క కాగితం రాయటం, చించి వెయ్యటం_ ఇదీ పని. ఆ కాగితంముక్కల కుప్ప చూడు అన్నయ్యా!" అన్నది నా చెల్లెలు.

"కుదరటంలేదు. మరేం చెయ్యమంటావ్?" అన్నాడు బావ.

"ప్రొద్దున్న అన్నయ్యాఇంటికి వెళ్ళివద్దాం... అమ్మంటే ఈ కథపూర్తిచేసిగాని ఎక్కడికీ కదలను అంటిరి! ఇటు కథా పూర్తిచెయ్యకపోతిరి; అటు అన్నయ్య ఇంటికీ రాకపోతిరి" అన్నది నా చెల్లెలు.

"అప్పుడే ఏదో మనస్సులోకి వచ్చింది; బిగువున కథ పూర్తి చెయ్యవచ్చును గదా అనుకున్నాను. నాలుగు కాగితాలు వ్రాసేటప్పటికి... ఏక బిగువున కథ పూర్తి చెయ్యవచ్చును గదా అనుకున్నాను..."

"అది ఒచ్చినదారినే పోయింది." అని మెగతాళి చేసింది నా చెల్లెలు.

"అలాగే," అన్నాడు బావ నవ్వుకుంటూ.

"బావా, ఈ సందర్భంలో నా సలహా ఒకటి వుంది" అన్నాను నేను.

"చెప్పు—అదేమిటో" అన్నాడు బావ.

"నువ్వు ఏ విషయం అన్నా వ్రాయి, ఏ విధంగానైనా వ్రాయి, కథపేరు మాత్రం 'బూరెలు' అనిపెట్టు" అన్నాను.

అందరం కాసేపు నవ్వుకున్నాం. భోజనాలు ముగించుకొని విశ్రాంతి తీసుకొని, కాఫీలు త్రాగి సాయంకాలం నాలుగయిదు గంటలకు అందరం మామగారివూరు బయలుదేరాం.

మా మామగారు ఉంటున్న వూరు అక్కడికి అయిదారు మైళ్లు వుంటుంది, అక్కడికి—అంటే మేము వుంటున్న

హైదరాబాదుకి. అసలు మా మామగారిది కృష్ణాజిల్లా. తండ్రి మరణానంతరం వారు ఆర్థికంగా దెబ్బతిని అక్కడ మిగిలిన ఆస్థి అమ్ముకొని యిక్కడకు వచ్చి వేశారు. కష్టపడి పనిచేసి ఆస్తి బాగా వృద్ధి చేశారు; ఆయనకు నా భార్యే సంతానం. మా మామగారు హైదబాదు వచ్చిన నాలుగో సంవత్సరంలో మా అత్తగారు మరణించింది. అందుకని ప్రస్తుతం ఆయన యేకాంతవాసమే చేస్తున్నారు. వంటవాణ్ణి ఒకణ్ణి పెట్టుకొని, వాడు వండి పెడుతుంటేతిని పొలంబుట్రా చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.

మా మామగారు వుంటున్న వూరు రోడ్డు ప్రక్కనే వుంది. రోడ్డు మంచిరోడ్డుకూడా. అయితే రవాణా సౌకర్యాలు తక్కువ. ప్రొద్దున్నే ఒక బస్సూ, చీకటి పడింతర్వాత ఒక బస్సూ మాత్రమే హైదరాబాద్ నుంచి ఆ రూట్న వెళ్తాయి. అందుకని మేము టాక్సీ చేసుకొని వెళ్ళాం.

మేము వెళ్ళేటప్పటికి ఆయన పాలేర్లకు పని పురమాయిస్తున్నారు. ప్రక్కనవున్న పశువుల కొట్టంలో వున్న నాలుగుజతల ఎడ్లూ మోరలు పైకెత్తి దాణాకోసం దిక్కులు చూస్తున్నాయి. కొట్టంముందు యిటీవలే మా మామగారు కొన్న ఆవు కట్టివేసి వుంది. ఎడ్లకూ, ఆవులకూ ముఖాలకు పసుపు కుంకుమలు రాసి కొమ్ములకు పూల దండలు కట్టారు. ఇంటి గడపలకు పసుపు, కుంకుమబొట్లు పెట్టారు. వాకిళ్ళకు తోరణాలు కట్టారు. అంతా నిశ్శబ్దంగా వుంది. పశువుల మెడలలోని గంటలధ్వని, అప్పుడప్పుడూ

వినబడుతూ, ఆ నిశ్శబ్దాన్ని ప్రఫుల్లం చేస్తూవుంది. నాకేమో అంతా కొత్తగా కనుపించింది. అంతలోకి, ఎడ్లకు దానా పట్టుకు వెళ్తున్న రాముడు మమ్మల్ని చూచి, "చుట్టాలు వచ్చారండోయ్!" అంటూ సంతోషంగా కేక వేశాడు.

మా మామగారు యెదురుగా వచ్చి, "అందరూ వచ్చారు. చాలా సంతోషం, రండి" అని మమ్మల్ని ఆహ్వానించి, "కాళ్ళకు నీళ్ళు తేవోయ్" అని నౌకర్ని కేక వేశారు.

మేము కాళ్ళు కడుక్కొని యింట్లో హాల్లోకి వెళ్ళి కూర్చున్నాం. నా కండ్లకు యిల్లంతా కొత్తగా కనిపించింది. నా భార్యకూడా అలాగే అనుకుంటూ వుందని అనిపించింది.

"ఏం అబ్బాయి, బాగున్నావా?" అని మామగారు బావని పలకరించారు.

"బాగానే వున్నానండీ" అన్నాడు బావ.

"పిల్లలు ఏరీ?" అన్నది నా భార్య.

"బయట ఆడుకుంటున్నట్లున్నారు—చల్ల గాలిలో కాసేపు ఆడుకోనివ్" అన్నారు మామగారు. నా చెల్లెలు వైపుకి తిరిగి "అబ్బాయినికూడా తీసుకొచ్చావు. చాలా మంచిపని చేశావమ్మా" అన్నారు.

ఆయన వైఖరి చూస్తే ముఖ్యమైన విషయం మాకు చెప్పటానికి, తబ్బిబ్బులు పడుతున్నట్లు అనిపించింది నాకు. అందుకని పిల్లలు బయట వుంటమే మంచిదని ఆయన అనుకున్నట్లుకూడా అనిపించింది.

"ఎప్పుడో ఒకసారి మిమ్మల్ని సందర్శించి పిలుద్దాం- అనుకున్నాను. తలవని తలంపుగా నేటికది నెరవేరింది" అని ప్రారంభించారు మామగారు. అని - నా భార్యనుచూచి, "చూడమ్మా; ఇవ్వాళ ఇంతకుముందు మీకు ఎవరికీ తెలియని నా జీవితంలోని ఒక రహస్యాన్ని చెప్పదలిచాను. అది విని నీవు ఏమనుకుంటావో! ఏమనుకున్నా ఒక విషయం మాత్రం మరచిపోకు తల్లీ! పైకి చెప్పుకోవటం నాకు చేతగాకపోయినా మనస్సులో నువ్వంటే నాకు ప్రాణం" అన్నారు.

మేము వూపిరి బిగబట్టి వింటూ కూర్చున్నాం. ఆయన కళ్లు చెమ్మగిలినై. నాకు పెండ్లయి దాదాపు పది సంవత్సరాలైంది. ఈ పది సంవత్సరాల్లో నేను ఏనాడూ ఆయన్ని ఈ స్థితిలో చూడలేదు. నాకేమీ తోచక మెదలకుండా కూర్చున్నాను. నా ఒక్కడి స్థితే కాదు; మా అందరి స్థితీ అదేవిధంగా వుంది.

మామగారు, ఒక్క క్షణం నిశ్శబ్దంగా వుండి, తన్ను తాను సంబాళించుకొని, "నా చిన్నప్పటిసంగతి - అప్పటినుంచీ చెపితేగాని మీకు అర్థంగాదు. ఆ రోజుల్లో మాఇంటి ప్రక్కన శంకరయ్యగారని ఒక మామూలు రైతు వుండేవాడు. ఆయన అసలు ఆ ప్రాంతాలవాడు కాదు. ఉత్తరాది నుంచి, పొట్ట గడవక, వచ్చి ఆవూళ్ళో స్థిరనివాసం ఏర్పాటుచుకున్నాడు. కష్టపడి కాస్త పొలం సంపాదించుకొని గౌరవంగా బ్రతుకుతుండేవాడు. అందరితో మర్యాదగా వుంటూ, ఎవ్వరికీ నొప్పి కలుగజెయ్యకుండా తన పనేమో తాను చూచు

కుంటూ కాలం గడుపుతుండేవాడు. ఆయనకు భార్యలేదు, ఒక కుమార్తెమాత్రం వుంది. ఆమెపేరు అహల్య. అహల్య అందమైన పిల్ల, చురుకైంది, అడకువ కలిగిందికూడాను. మా ఇల్లు పక్కఇల్లే వాళ్ళదీ అవటంవల్ల అహల్య చిన్నప్పటి నుంచీ నాతో చనువుగా వుండేది. నాకు తోచనప్పుడల్లా, కబుర్లకు వాళ్ళ ఇంటికి వెళ్తుండేవాణ్ణి. శంకరయ్యగారికి మా కుటుంబం అంటే చాలా గౌరవం. అందులో మా నాన్నంటే మరీనూ. మా నాన్న ఎదురుగా ఆయనెప్పుడూ కూర్చుని ఎరుగడు. ఎంతసేపైనా నిలబడే మాట్లాడేవాడు. మానాన్న కూర్చోమన్నా కూర్చునేవాడు కాడు. అందులో మొదట ఆయన మావూరు వచ్చినప్పుడు ఆవూళ్ళో నిలబడటానికి మా నాన్న చాలా సహాయం చేశాడట. ఆవిశ్వాసం వుండేది ఆయనకి.

అహల్యా నేనూ అలా పెరిగి పెద్దవాళ్ళం అయినాం. పెద్దవాళ్ళం అయినకొద్దీ మా స్నేహం వృద్ధి చెందిందేగానీ ఏమాత్రం తగ్గలేదు. ఇంతలో మా అమ్మకు రణం లేచి మంచపట్టింది. ఎన్ని మందులు ఇప్పించినా తగ్గలేదు. ఏడాదిపాటు మంచంలోనే వుండి మరణించింది. మా తలిదండ్రులకు నేను ఒక్కణ్నే అవటంవల్ల ఇంట్లో అన్నం వండిపెట్టే దిక్కే లేకపోయింది. గడవటం కష్టం అయి మా నాన్న నాకు త్వరగా వివాహం చేసి, కోడల్ని తీసుకురావాలని సంకల్పించాడు.

ఆ రోజులు వేరు. ఆ రోజుల్లో ఏవిషయంలో నైనా కొడుకులతోనూ కూతుళ్ళతోనూ సంప్రదించాలని తల్లి

దంద్రులకు వుండేదికాదు. పెళ్ళి విషయంలో కూడా అంతే! 'వాళ్ళకి ఏం తెలుసు – వాళ్ళ మొఖం' అనుకునేవారు. నా పెళ్ళి విషయంలో మా నాన్న కూడా ఈ విధంగానే ప్రవర్తించాడు. సంబంధానికి ఎవ్వరయినా వచ్చినా తనే మాట్లాడి పంపించేవాడు. ఎప్పుడో ఒకప్పుడు నాకు తెలియకుండానే, ఎవ్వరితోనో ఒకరితో ముహూర్తం నిశ్చయించి వేస్తాడేమోనని నాకు భయంగావుండేది.

అట్లా జరగటం నాకేమీ ఇష్టంగా వుండేదికాదు. అప్పటికే నా మనస్సు అహల్యమీద లగ్నం అయివుంది. ఆమెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను. అహల్య నా దగ్గర ఎప్పుడూ ఈ ప్రస్తావన లేకపోయినా, కలకాలం మేము కలిసివుంటాం–అన్నట్లుగానే ప్రవర్తిస్తూవుండేది.

ఇక ఎక్కువకాలం ఆగితే ప్రమాదం సంభవించవచ్చని భయపడి, ఊళ్ళోవున్న పెద్దమనిషితో 'నాకు అహల్యను చేసుకోవాలనివుంద'ని మా నాన్నకు చెప్పించాను. ఈ మాటకు మా నాన్న ఉగ్రుడయ్యాడు. నిప్పులు చెరిగాడు. ఉత్తరాదినుంచి వచ్చినవారంటే ఆ ప్రక్కల అందరికీ తేలికగా వుండేది. పైగా శంకరంగారు పొట్టకోసం మావూరు వచ్చారనే విషయం, మానాన్న ఎన్నడూ మరువలేకపోయారు. 'వీల్లేదు. ఇక ఆమాట నాదగ్గర ఎత్తవద్దు' అన్నాడు.

ఈమాట వూళ్ళో ఎట్లా తెలిసిందో, తెల్లవారేసరికి వూరంతా పొక్కింది. మానాన్న పెళ్ళి ప్రయత్నాలు ముమ్మరంగా సాగించాడు. ఒకరోజున శంకరంగారు కనుపిస్తే

నేను అహల్యను పెండ్లి చేసుకునే ప్రస్తావన ఎత్తాను. 'నాయనా, ఇటువంటివి కోరకు. నా ఉద్దేశం ఎట్లావున్నా నేను నీ తండ్రికి అనుకూలంగా పోయేవాణ్ణిగాని, ఎదిరించి ఏ పనీ చేసేవాణ్ణి కాను. వూళ్లో ఈ విషయం రకరకాలుగా చెప్పుకుంటున్నారు. మమ్మల్ని ఈ వూళ్లో వుండనివ్వదలిస్తే ఈ రోజు మొదలుకొని మాయింటికి రాకు నాయనా' అన్నా రాయన.

ఇంకేం చెయ్యను? అంతలో ఒక మంచి సంబంధం కుదిరిందని చెప్పి, నాన్న నా వివాహానికి ముహూర్తం పెట్టించాడు. ఆముహూర్తందాక రాకముందే ఏంజరిగిందో ఏమో, శంకరయ్యగారు వున్న ఆస్తి అయినకాడికి అమ్ముకొని, ఎవ్వరికీ తెలియకుండా కుటుంబాన్ని తీసుకొని ఎక్కడికో వెళ్ళి పోయారు. ఆయన వెళ్ళిపోవటానికి కారణం అనేకులు అనేక విధాలుగా చెప్పుకున్నారు గాని, నాకు అప్పట్లో నిజం తెలియలేదు.

నాకు పెండ్లి అయింది. నాభార్య కాపురానికివచ్చింది. అంతకుముందు నా మనస్సు ఎట్లావున్నా, ఆమె కాపురానికి వచ్చిన తర్వాత శాంతించింది. కొద్దికాలంలోనే నేను అహల్యను మరచిపోయాను.

కాలం ఎప్పుడూ ఒకటేతీరున గడవదుగదా! మాకు ఒక ఫ్యాక్టరీ ఉండేది. అది బియ్యంఫాక్టరీ. ఆఫ్యాక్టరీ మా నాన్న కట్టించిందే—

కట్టించటమే కొద్దిగా అప్పుచేసి కట్టించారు. నాన్న బ్రతికివుండగానే, దానిమీద నష్టంరా ప్రారంభించింది. అటు

తిరిగి ఇటుతిరిగి ఆయన చనిపోయిన ఆరేడు ఏళ్ళకు అప్పులు ఎక్కువైనై. అప్పుల వాళ్ళ ఒత్తిడి భరించలేక, నేను ఆస్తంతా అమ్మివేసి తీర్చాను. అప్పటికి నాలుగు యెకరాలు మిగిలినై. ఇక ఆవూళ్ళో తల ఎత్తుకు తిరగ లేక, నాలుగు ఎకరాలు అమ్మి ఈ ఊళ్ళో చౌకగా పాతిక యెకరాలు కొన్నాను……"

మామగారు తల వంచుకొని, మావంక కన్నెత్తి అయినా చూడకుండా చెప్పుకుపోతున్నారు. ఏదో పెద్ద ఆపద రాబోతున్నప్పుడు కూర్చున్నట్లు మేమంతా స్థాణువులమై కూర్చున్నాం. ఏదో పెద్ద భయం మమ్మల్ని ఆవహించింది. ఒకరి నొకరు చూచుకోటానికే భయం వేసింది. ఇక నా భార్య సంగతి చెప్పనే అవసరం లేదు!

మసక పడింది. కొట్టంలోనుంచి పశువుల మెడలలోని గంటల ధ్వనులూ, ఆడ పశువుల పాలు తీస్తున్న 'జుయ్' ధ్వనులూ అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఒకపిట్ట కూసింది. వంటవాడు నిశ్శబ్దంగా వచ్చి లాంతరు వెలిగించి వెళ్ళి పోయాడు.

మామగారు నెమ్మదిగా తలపైకెత్తి నా భార్యను సూటిగా చూచి "చూడమ్మా; అప్పటికి నీవు నెలలబిడ్డవు. నిన్ను చంకనేసుకొని నేనూ, మీఅమ్మా యీవూరువచ్చాం. అప్పుడీవూరు ఇట్లా వుందా? నా అనేవారు లేరు. పైగా ఎక్కడ నుంచో వచ్చామని ఈవూరి వారికి మామీద పగ. సరే, ఎట్లాగో కష్టపడ్డాం, నిలదొక్కుకున్నాం.

ఆనాటికి ఈవూరువచ్చి పదిసంవత్సరాలైంది. కరీం నగర్ జిల్లాలోని ఒక గ్రామంలో నీటివసతి కలగబోతున్న మంచి భూములు చౌకగా అమ్మబోతున్నారని తెలిసి, అక్కడకు వెళ్ళాను. ఆ భూ ఖామందును కలుసుకొని, ఆభూమిని చూశాను. ఆ భూమంతా గులకరాయే. గజంలోతు త్రవ్వి చూచినా రాయి విడలేదు. కొని లాభం లేదనుకొని ఆ సాయంకాలం ఇంటికి వచ్చివేస్తున్నాను. ఆ వూరి రైలు స్టేషన్ దగ్గర ఒక ఇల్లువుంది. ఆ యింటి గడపలో ఒక స్త్రీ నిలబడివుండటం చూశాను, అహల్యేమో అనుకున్నాను. ఆస్త్రీ నన్ను చూచో ఏమో గబగబా ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఆమనిషి యెవ్వరో తెలుసుకోకుండా నాకు ఒక్క అడుగు ముందుకు వెయ్యబుద్ధికాలేదు. యెన్నో జ్ఞాపకాలు మనస్సును కలత పెట్టినై. ఆ ఇంటిదగ్గరకువెళ్ళి పిలిచాను— 'ఎవ్వరు ఇంట్లో?' అని. రెండు మూడు పిలుపులకూ సమాధానం లేదు. ఇంట్లోకి వెళ్ళి మళ్ళీ పిలిచాను, 'ఎవ్వరు ఇంట్లో ?" అని.

ఇక తప్పదు అనుకుందో ఏమో, ఆ స్త్రీ ప్రక్కగదిలో నుంచి నేనువున్నచోటుకు వచ్చి నిలబడింది నా కళ్ళను నే నమ్మలేక పోయాను. ఆమె అహల్యే! కాని ఎంతమార్పు! కాలం ఆమెను ఎంతగా మార్చివేసింది.

ఈ విధంగా అహల్యా నేనూ జీవితంలో మళ్ళీకలిశాం. ఆమె తన జీవితం నాకు చెప్పింది. నేను తనను చేసుకుంటానని చెప్పటానికి తన తండ్రే కారణం అనుకొని నాన్న ఆయన్ని 'ఏం చేస్తాడో చూడు నిన్ను?' అని బెదిరించాడట.

ఇక ఆ గ్రామంలో వుంటే పరువు దక్కదని అయినకాడికి వున్న ఆ స్వంతా అమ్ముకొని, దూరపు బంధువు ఒకడుంటే అతనికి ఇచ్చి తనను వివాహంచేసి తనతండ్రి ఈ గ్రామంలో స్థిరపడి పోయాడట. కాని ఆ గ్రామం విడిచి వచ్చినందుకు దిగులు ఆయన గుండెను నములుతూనే వుందట. అలాగే మంచంపట్టి ఈ గ్రామం వచ్చిన కొద్దిరోజులకే మరణించాడట. అప్పటినుంచీ తనూ తన భర్తా ఈఇల్లు అద్దెకుతీసుకొని కాలం గడుపుతున్నారట.

పైగా ఆమె భర్తకు రెండుసంవత్సరాలక్రిందట పక్షవాతంవచ్చి మంచంపట్టాడు. నన్ను తీసుకువెళ్ళి తన భర్తను చూపింది. అతను లోపల వరండాలో మంచంమీద పడుకొని వున్నాడు. చాలా క్షీణదశలో వున్నాడు. అహల్య నన్ను గురించి అతనికి చెప్పింది అతనికి ఒక చెయ్యీ కాలూ పడి పోయింది. ఒంటి చెయ్యితోనే నమస్కరించాడు.

ఆనాటినుంచీ నిత్యం అహల్య నామనస్సులో మెదులుతూనేవుండేది. అప్పుడప్పుడు వెళ్ళి పలకరిస్తూ వుండేవాణ్ణి. ఒకటిరెండు రోజులు వాళ్ళ యింట్లో వుంటూ వుండేవాణ్ణి కూడా.

అట్లా జరుగుతూ వుండగా ఒకరోజు అహల్య దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. తన భర్తకు ఎక్కువగా వుందనీ బ్రతుకుతారనే ఆశ లేదనీ వెంటనే రావలసిందనీ వ్రాసింది. నేను బయలుదేరి వెళ్ళాను నేను వెళ్ళేటప్పటికి అతను స్పృహలోలేడు. అంతిమ గడియలు సమీపించి వున్నయ్.

అహల్య నేను వచ్చానని అతని చెవిలో వూదింది. అతను నాకోసమే ప్రాణాలను బిగపట్టుకొని వున్నట్టు, కళ్ళు తెరిచాడు నిదానంగా. నన్ను చూచి అహల్య చేతిని నా చేతిలోవుంచి కన్నుమూశాడు. నేను అక్కడేవుండి అంత్య క్రియలు జరిపించాను."

అంతవరకూ చెప్పి మామగారు ఆగారు; ఒక్క నిట్టూర్పు విడిచారు. అసలు ఘట్టంలోనికి వస్తున్నామని అందరం గ్రహించాం. ఆఘట్టం చెప్పటానికి వారు చాలా కలవర పడుతున్నారుకూడా. గ్రహించాం. అందరం నిశ్శబ్దంగా కూర్చున్నాం. నా చెల్లెలు మాత్రం, "తరువాత ఏం జరిగింది, మామయ్యా!" అని అడిగింది.

ఈ ప్రశ్న ఆయన పనిని కొంచెం తేలిక పరిచింది. "ఏం చెప్పనమ్మా! నాకు ఏమీ తోచలేదు. అహల్యను గాలికి వదలి వెళ్ళలేక పోయాను. భర్త జబ్బువల్లా ఇతర సంపాదన ఏమీ లేక పోవటంవల్లా వాళ్ళు చాలా ఋణం చేశారు. నేను పదిరోజులు అక్కడే వుండి వాళ్ళ కున్న భూమిని ఋణాలకు కట్టాను. అలా కట్టగా అయిదు వందల రూపాయలు మిగిలాయి. ఆడబ్బు ఆమెకు ఇవ్వ బోయాను.

'నా కెందుకు మీ దగ్గరే వుంచండి' అన్నది ఆమె.

ఆ డబ్బు నాదగ్గరే వుంచాను. ఆమెకు కావలసి నప్పుడల్లా ఇస్తుండేవాణ్ని.

ఈ డబ్బు అయిపోయింతర్వాత ఏంచెయ్యాలి - అని అహల్య ఆలోచిస్తున్నట్లు కనిపించేది కాదు. తన భవిష్యత్తును గురించి ఏనాడూ నాతో మాట్లాడి ఎరగదు. తను అనుకొని కూడా వుండదని నా నమ్మకం. తన మంచి చెడులు చూడ వలసినబాధ్యత పూర్తిగా నామీద వున్నట్లే ప్రవర్తించేది. నాకూ అట్లాగే అనిపించింది.

నేను నెలకు ఒకసారి ఆవూరు వెళ్ళి ఆమెకు కావలసిన సరుకులన్నీ కొనిపెట్టి, కొద్దిగా డబ్బు ఇచ్చి, అయిదారు రోజులు వుండి తిరిగి వస్తూవుండేవాణ్ణి. ఆమెను చూడకుండా వుండలేక పోయేవాణ్ణి. ఆమెకూడా అంతే..." మామగారు మళ్ళీ ఆగారు... ఒక్కనిట్టూర్పు విడిచి అందరనీ కలయ జూశారు. వారు చెప్పబోయేవిషయం మాలో ప్రతిఒక్కరూ గ్రహించుకున్నట్లువుంది. మాముఖాలుచూచి వారీ విషయం గ్రహించినట్లున్నారు.

"ఇంకెందుకు, నా గోడు పొడిగించటం - మిమ్మల్ని విసిగించటం ? నేను, అహల్యను గాఢంగా ప్రేమించాను. ఆమెకూడా అంతే. నన్ను తిరిగి కలవక ముందు జరిగిన జీవితం అంతా ఆమెను ఒక పెద్ద పీడకలగా కనుపించేది. మొద్దు నిద్రలోనుంచి లేచి, మామూలు జీవితంలో అడుగు పెట్టిన వ్యక్తికిమల్లే మాట్లాడేది——అహల్య.

అట్లా కొన్నాళ్ళు గడిచినై ... మాకొక పుత్రుడు కలిగాడు. పుత్రుడు కలగటం ఆమెను మామూలుగానే వుంది. చాలా సంతోషించింది. కాని నన్నొక పెద్ద సమస్య

ఎదుర్కొంది ? నా భవిష్యత్తును ఏవిధంగా నిష్కళంకం చెయ్యాలి– అని ఆలోచించాను. దారి దొరకలేదు.

ఈ విషయం నా భార్యతో చెప్పకుండా దాచటం అన్యాయం అని చెప్పి, ఆమెకు చెప్పాలని ఎన్నోవిధాల ప్రయత్నించాను. కాని చెప్పలేకపోయేవాణ్ణి. ఆమెకు, నా మనస్సును ఏదోవేధిస్తూవుందనీ తెలుసు. ఒక్కొక్కప్పుడు ఆమె మాటలను జ్ఞాపకంచేసి చూసుకుంటే ఆమెకు అసలు విషయము తెలుసా–అనే సందేహంకూడా నాకు కలుగుతూ వుండేది. ఏమయినా ఎంత ప్రయత్నించీ ఆమెకు చెప్పలేక పోయాను. నేను మధనపడుతూవుండగానే జబ్బు చెయ్యటం; ఆమె దాటిపోవటం జరిగింది. ఆమెకేగనుక నేనీ సంగతి చెప్పి వుంటే నేడు నాకీ సమస్యేవుండేది కాదు" ... అన్నారు మామగారు.

ఈ విషయం ఏట్లా స్వీకరిస్తూవుందో అని నేను నా భార్యను పరీక్షగా చూశాను. తొణకకుండా, బెణకకుండా వింటూ వుంది. నా చెల్లెలూ బావా ఉద్రేకావస్థలో వున్నారని వారి ముఖాలు చెప్పక చెపుతున్నాయి. నా బావ రచయిత గనుక ఈ సన్నివేశం అతన్ని బాగా ఆకర్షించింది.

"ఆమే, ఆమె కొడుకూ ఇప్పుడెక్కడ వున్నారు మామయ్యా?" అని అడిగింది నాచెల్లెలు.

"ఇక్కడే వున్నారమ్మా. వారిని ఈవూరు తీసుకువచ్చి వారం రోజులైంది. ఈ ఇంట్లోనే వుండమంటే, 'కాదు, వేరుగా వుండనివ్వు' అన్నది, అహల్య. ఇక వాళ్ళని నాకు

సంబంధం లేనివారిగా ప్రపంచాన్నుంచి దాచటం ఇష్టం లేదమ్మా!... అందుకని నాతోనే ఉంచుకోదలిచాను" అన్నారు మా మామగారు.

నా చెల్లెలు ఒక్కక్షణం ఆలోచించి, "ఆమెను వివాహం చేసుకుంటావా మామయ్యా ?" అని అడిగింది.

"అవసరం అయితే" అన్నారు మామగారు—ఒక్కొక్క అక్షరం తూచితూచి చెప్పారు.

"బాగుంది" అన్నాడు బావ.

మామగారు నా భార్యను ఒక్కక్షణం తదేక ధ్యానంతో చూచి, "చూడవమ్మా ... నేను పొరపాటే చేశాను. కాని నా పొరపాటుకి అహల్యనూ ఆమె కుమారుణ్ణి శాశ్వతంగా అపకీర్తిపాలు చేయటానికి నా మనస్సు అంగీకరించటం లేదమ్మా. నా కొడుకుని, నా కొడుకని లోకానికి చెప్పటానికి నేనెందుకు భయపడాలి ? అయితే ఒక సంగతమ్మా! ఈ ఆస్తి నా కేమీ అక్కరలేదు. ఈ ఇల్లు కూడా నాకు వద్దు. ఇదంతా నీదే. నేను నా ఉద్దేశం మొదటిసారిగా అహల్యకు చెప్పినప్పుడు, ఆమె ఒప్పుకోలేదు. 'ఈ జన్మకి ఇలా జరిగిపోనివ్వు' అన్నది. చివ్వరికి నాఆస్తి నీకు వదిలివేస్తే అంగీకరిస్తానన్నది. నేను సరే అన్నాను... చూడమ్మా, ఈవూరికి దక్షిణాన దూరంగా నాకు అయిదు ఎకరాల మెట్టవుంది. అది అడివిభూమి. దాన్ని సేద్యాన్ని చేసుకుంటూ అక్కడే ఒక గుడిసె వేసుకుని వుందామని నేను నిశ్చయించుకున్నానమ్మా. ఇక నాకున్న యావదాస్తీ నీదే.

రేపు నీ పేర రాసి ఇచ్చివేస్తాను..." అనిచెప్పి మూలనున్న పొన్నుకర్ర తీసుకుని, "నేను అటువూళ్ళోకి వెళ్ళివస్తానమ్మా! కొద్దిగా పనివుంది. నేను రాత్రిళ్ళు భోజనం చెయ్యను. మీ మీ భోజనాలు కానివ్వండి" అని బయటకు వెళ్ళారు.

మేమంతా నిశ్శబ్దంగా కూర్చున్నాం. మేమంతా ఆలోచించుకొని ఒక నిర్ణయానికి వచ్చే అవకాశంఇవ్వగలందులకు మామగారు బయటకు వెళ్ళారని మా అందరికీ మనస్సులో తెలుసు. మా అందరి దృష్టులూ నా భార్యమీదే కేంద్రీకరించబడి వున్నాయ్. ఆమె అభిప్రాయం గదా ముఖ్యం!

ఆలోచిస్తూకూర్చున్న ఆమె నెమ్మదిగా తల పైకెత్తి వంటవాణ్ణి పిలిచింది— "అహల్యగారు ఎక్కడ వుంటున్నారో నీకు తెలుసా?" అని అడిగింది.

"ఎక్కడో ఏమిటమ్మా! ఈ అవతల బజార్లోనే వుంటున్నారు" అన్నాడు వంటవాడు.

"నేను ఆమెను కలుసుకోవాలి; దారి చూపిస్తావా?"

"రండమ్మగారూ!" అన్నాడు వంటవాడు.

నాకు నిజంగా భయం వేసింది. ఆమెదగ్గరకు వెళ్ళి, నా భార్య ఏ కజ్జాలోకి దిగుతుందో అని— "ఇప్పుడు ఆమె దగ్గరకు ఎందుకూ?" అన్నాను.

"ఆమె వేరుగా ఉండటంలో అర్థంలేదు. నాన్నగారు తిరిగి వచ్చేటప్పటికి ఆమెనూ, నా తమ్ముణ్ణీ తీసుకువస్తాను. ఈ ఆస్థంతా నా తమ్ముడిదే" అన్నది నా భార్య.

"సెభాస్, లక్ష రూపాయీల విలువ చేసే మాట అన్నావు."

"నేనుకూడా వస్తాను వదినా!" అని నా చెల్లెలూ బయలు దేరింది.

ఇద్దరూ అహల్యగారిని, ఆమె కుమారుణ్ణి తీసుకురావ టానికి బయలుదేరారు.

"బావా!" అన్నాను.

"బాగుందోయ్!" అన్నాడు బావ.

"ఉగాదిని గురించి నీవు వ్రాస్తున్న కథకు 'బూరెలు' అని పేరు పెట్టమన్నాను. ఆ పేరు బాగాలేదని నా మన స్సుకే అనిపిస్తూవుంది బావా!" అన్నాను.

"మరేపేరు పెట్టమంటావు?" అని అడిగాడు బావ.

"'మేలు కలయిక' అని పేరు పెట్టు బావా" అన్నాను.

"ఆ, బాగుందోయ్, బాగుంది" అన్నాడు బావ ఆనందంగా నవ్వుతూ.